భట్టి, ఉత్తమ్‌తో రిజర్డ్ రూసో భేటీ

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): అమెరికాలోని వాషింగ్టన్ డీసీ కేంద్రంగా పనిచేసే సెంటర్ ఫర్ స్ట్రాటజీస్ సంస్థ వైర్మన్ రిచర్డ్ రూసో రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డితో గురువారం హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. సోలార్ పవర్‌పై విస్తృతంగా చర్చించారు. భారత్‌లోని వివిధ రాష్ట్రాల్లో విద్యుత్తు రంగంలో తమ సంస్థ పనిచేస్తుందని రిచర్డ్ రూసో వారికి వివరించారు.

చంద్రబాబుపై ఏపీ సీఐడీ చార్జిషీట్

ఇన్నర్ రింగ్‌రోడ్ కేసులో దాఖలు

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు, ఆ పార్టీ నేతలు లోకేశ్, మాజీ మంత్రి నారాయణ తదితరులు నిందితులుగా ఉన్న ఏపీ ఇన్నర్ రింగ్‌రోడ్డు కుంభకోణంలో ఆ రాష్ట్ర సీఐడీ గురువారం చార్జిషీట్ దాఖలు చేసింది. సింగపూర్‌తో చంద్రబాబు ప్రభుత్వం చేసుకున్నది తప్పు డు ఒప్పందం అని తెలిపింది.

ఓటుకు నోటు కేసు అడ్వకేట్‌కు అందలం

- సలహాదారులే వద్దన్నారు.. ఎంతమందిని నియమించారో!
- కేసీఆర్ నోటిపై చేసిన ఉద్యోగాలను ఇప్పుడు ఇస్తున్నారు
- టీఎస్‌పీఎస్సీలో స్థానికేతరుల నియామకం ఎందుకు?
- రేవంత్ సర్కార్‌ను నిలదీసిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

ఆ కొలువులు కేసీఆర్ చలవే

టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్‌ను చూపుతున్న కవిత

ఈ ఏడాది డిసెంబరులోగా రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటికి కేవలం 60 మాత్రమే కొత్త ఉద్యోగాలను నోటిపై చేసిందని కవిత ప్రస్తావించారు. గతంలో కేసీఆర్ నోటిపై చేసిన ఉద్యోగాలనే ఇప్పుడు ఇస్తున్నారని చెప్పారు. సింగరేణి డిపెండెంట్ ఉద్యోగాలు వచ్చిన వారికి సీఎం రేవంత్‌రెడ్డి నియామక పత్రాలను అందించడం సిగ్గుచేటని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీయే డిపెండెంట్ ఉద్యోగాలను రద్దు చేసిందని గుర్తుచేశారు. 'మీ గురువు చంద్రబాబు హయాంలో సింగరేణిలో గోల్డెన్ హ్యాండ్‌షేక్ ఇచ్చి ఉద్యోగులను తొలగించి సంఖ్యను కుదించారు. కాబట్టి అబద్ధాలు చెప్పడం మానేసి కొత్తగా వేసిన ఉద్యోగాలు ఎన్నో చెప్పాలి' అని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డిలో పచ్చ రక్తం ప్రవహిస్తున్నదని అన్నారు.

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వానికి సలహాదారులే ఉండవద్దని కేసులు వేసిన రేవంత్‌రెడ్డి.. ఇవాళ ఎంత మందిని సలహాదారులుగా నియమించుకున్నారో చెప్పాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్‌చేశారు. రాజకీయ నాయకులను సలహాదారుగా నియమించుకోవచ్చని, కానీ ఢిల్లీలో ఒక మాజీ న్యాయమూర్తి వద్ద పనిచేసిన వ్యక్తిని ఓ కొత్త పోస్టు సృష్టించి అసెంబ్లీకి సలహాదారునిగా నియమించడమేంటి? అని ఆమె ప్రశ్నించారు. కవిత గురువారం తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. ఓటుకు నోటు కేసులో రేవంత్ తరపున వాదనలు వినిపించిన దేవనా సైగల్‌ను సుప్రీంకోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా, తేర రజినీకాంత్‌రెడ్డిని అదనపు అడ్వకేట్ జనరల్‌గా నియమించడాన్ని తప్పు పట్టారు. కేసీఆర్ హయాంలో ప్రాజెక్టులను ఆపడానికి దొంగ కేసులు వేసిన ఒక న్యాయవాదిని సుప్రీంకోర్టులో అడ్వకేట్ ఆన్ రికార్డుగా నియమించడాన్ని తీవ్రంగా ఖండించారు.

స్థానికేతర అధికారుల నియామకం

అత్యంత కీలకమైన విద్యుత్తు సంస్థలో ప్రభుత్వం నియమించిన నలుగురు డైరెక్టర్లలో ముగ్గురు స్థానికేతరులే ఉన్నారని కవిత మండిపడ్డారు. నందకుమార్, నర్సింలు, సుధా మాధూరిని డైరెక్టర్లుగా నియమించారని కవిత పేర్కొన్నారు. తెలంగాణకు చెందిన ఏడుగురు సీనియర్ అధికారులను పక్కనబెట్టి ధర్మాధికారి కమిషన్ నివేదికను సాకుగా చూపించి స్థానికేతరులను నియమించారని, తెలంగాణ ప్రయోజనాలపై వాళ్లకు ఏం ఆసక్తి ఉంటుందని ప్రశ్నించారు. ఈ ముగ్గురు డైరెక్టర్లను తొలగించి తెలంగాణ వారిని నియమించాలని డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డిపై అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఆయన్ను తప్పించాలని కోరారు. టీఎస్‌పీఎస్సీ సభ్యుడిగా నియమించిన రామ్మోహన్‌రావు తెలంగాణ వ్యక్తి కాదన్నారు. రాజకీయాల్లో ఉన్న వారిని సభ్యులుగా నియమించబోమని చెప్పిన సీఎం టీడీపీలో పనిచేసిన రజనీకుమారిని ఎలా నియమించారని నిలదీశారు. త్వరలో తాము ఈ అంశంపై గవర్నర్‌ను కలిసి వినతిపత్రం అందిస్తామని వెల్లడించారు.

రాష్ట్ర గీతంపై మాట్లాడడం హాస్యాస్పదం

తెలంగాణ తల్లి విగ్రహంలో మార్పులు, రాష్ట్ర గీతంపై విలేకరులు అడిగిన ఒక ప్రశ్నకు కవిత సమాధానమిస్తూ.. సీఎం రేవంత్‌రెడ్డి నిజంగా హృదయంపై చేయి వేసుకొని జై తెలంగాణ అంటే ఇవన్నీ చేసే అర్హత ఉంటుందని అన్నారు. ఎప్పుడూ జై తెలంగాణ అనని వ్యక్తి తెలంగాణ తల్లి, రాష్ట్ర గీతం గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు.

సీనియారిటీలో ఆంధ్ర అధికారులొచ్చారు

- ఇందులో తప్పేముంది? హర్షించండి
- నాడు రేవంత్ వాదించింది కరెక్టే..!
- మంత్రి కొండా సురేఖ వితండ వాదన

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): సీనియారిటీ ప్రకారం కొందరు ఆంధ్రా అధికారులకు కొన్ని పదవులు ఇచ్చామని, నాడు ఆంధ్ర అధికారులు వద్దని మేము తిట్టినా.. నేడు పదవులు ఇచ్చాం కాబట్టి హర్షించాలని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశం అనంతరం మీడియా పాయింట్ వద్దకు వచ్చిన మంత్రిని.. 'నాడు ఆంధ్రా అధికారుల పెత్తనం వద్దని డిమాండ్ చేసిన మీరు.. ఇప్పుడెలా ఆంధ్రా అధికారులకు పదవులు కట్టబెట్టారు?' అని ప్రశ్నించగా.. తమ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆంధ్రా అధికారులకు పదవులు దక్కడంపై రాజకీయం చేయడం సరైంది కాదని అన్నారు. ఎక్కడైనా సీనియారిటీని బట్టి అధికారులకు ఆయా పదవులు దక్కుతాయని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆంధ్రా అధికారులను అందలం ఎక్కించారని మరోసారు వితండ వాదం చేశారు. బీఆర్ఎస్ హయాంలో ఉన్న ఆంధ్రా అధికారులను రేవంత్‌రెడ్డి తిట్టడం సబబేనని చెప్పారు. ఇప్పుడు ఆయనొక ముఖ్యమంత్రిగా సీనియారిటీ బట్టి ఆంధ్రా అధికారులకు పదవులు ఇచ్చారని, మంచి నిర్ణయాలు తీసుకునేటప్పుడు హర్షించాలని చెప్పారు. నాడు తిట్టినా.. నేడు వారికే పదవులు ఇచ్చారంటే మంచి ఆఫీసర్లు, సిన్సియారిటీ ఉన్నోళ్లని గుర్తించాలని తెలిపారు. టీఎస్‌పీఎస్సీ వైర్మన్‌గా మహేందర్‌రెడ్డిని నియమించడం పట్ల నిరుద్యోగుల్లో అసహనం పెరుగుతుందని ప్రస్తావించగా.. అట్లాంటి భయం అవసరం లేదని చెప్పారు. ఏ ఒక్క నిరుద్యోగికి కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్యాయం జరగదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మ్యానిఫెస్టో అమలు చేసే దిశగా వెళ్తుందని, తమ గురించి మాట్లాడే నైతిక హక్కు ఎమ్మెల్సీ కవితకు లేదని మండిపడ్డారు.

ఐదు కారణాలతో మేడిగడ్డ డ్యామేజ్

- రాష్ట్ర ప్రభుత్వానికి విజిలెన్స్ నివేదిక

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): మేడిగడ్డ బరాజ్ కుంగిన ఘటనపై విజిలెన్స్ కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను అందజేసింది. ఈ నివేదికలో మేడిగడ్డ కుంగిపోవడానికి ఐదు కారణాలను వివరించింది. మొదటి నుంచీ ప్రాజెక్టు నిర్వహణను గాలికొదిలేశారని పేర్కొన్నది. బరాజ్ నిర్మాణం పూర్తయిన తర్వాత ఇరిగేషన్ అథారిటీ తనిఖీ చేయలేదని తెలిపింది. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయినా షీట్స్, ఆర్ఆర్ పిచ్చింగ్‌లను ఏజెన్సీ తొలగించలేదని తెలిపింది. దీంతో వరద వచ్చినప్పుడు బరాజ్‌కు నష్టం కలిగినట్టు వెల్లడించింది. 2020 మే18నే డ్యామేజ్ అయ్యిందని తెలిపింది. ఇలా ఐదుసార్లు వరద వచ్చినా మెటీరియల్ తీసివేయలేదని పేర్కొన్నది. తొలిగించాలని అధికారులు 4 సార్లు చెప్పినా ఏజెన్సీ పట్టించుకోలేదని చెప్పింది. వరద వచ్చిన తర్వాత చేపట్టాల్సిన పనులను కూడా చేయలేదని పేర్కొన్నది.

బీఎడ్ అభ్యర్థులపై సానుకూలంగా స్పందించాలి

- వారి 15 ఏండ్ల పోరాటానికి శాశ్వత ముగింపు పలకాలి
- రాష్ట్ర సర్కారుకు హైకోర్టు సూచన

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ 2008 అభ్యర్థులను ఎస్జీటీ పోస్టుల్లో నియమించడంపై ఏపీ ప్రభుత్వ తరహాలో సానుకూల నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు గురువారం ప్రభుత్వానికి సూచించింది. అదే నోటిఫికేషన్‌కు చెందిన బీఈడీ అభ్యర్థులకు ఏపీ ప్రభుత్వం శాశ్వత విధానంలో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా అవకాశం ఇచ్చిందని గుర్తు చేసింది. ఒక నోటిఫికేషన్‌లోని అభ్యర్థుల్లో కొందరు ఉద్యోగాలు చేస్తుండగా మరికొందరు 15 ఏండ్లు పోరాటంలోనే ఉన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని, ఇది సరైనది కాదని అభిప్రాయపడింది. 2008 డీఎస్సీ నోటిఫికేషన్లో ఎస్జీటీ పోస్టుల్లో డీఎడ్ అభ్యర్థులకు 30శాతం రిజర్వేషన్ కల్పించడాన్ని సవాల్ చేస్తూ బీఎడ్ అభ్యర్థుల వ్యాజ్యాలను జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ నామవరపు రాజేశ్వరరావుతో కూడిన ధర్మాసనం గురువారం విచారించింది.

నాలుగు రాష్ట్రాల్లో ఎన్ఐఏ సోదాలు

- హైదరాబాద్‌లో 2 చోట్ల తనిఖీలు
- వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్ ఫోన్ సీజ్
- ఇదొక అబద్ధపు కేసు: వేణుగోపాల్
- మావోయిస్టు సీసీ మెంబర్ దీపక్ సమాచారం ఆధారంగా సోదాలు

వేణుగోపాల్

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ)/హిమాయత్‌నగర్/మన్సూరాబాద్: తెలంగాణసహా కేరళ, తమిళనాడు, మహారాష్ట్రలోనూ జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) గురువారం సోదాలు నిర్వహించింది. మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు, కేంద్ర కమిటీ సభ్యుడు, వెస్టర్న్ ఘాట్ స్పెషల్ జోన్ కమిటీ సెక్రటరీ, సౌత్ రీజినల్ బ్యూరో ఇన్‌చార్జి సంజయ్ దీపక్‌రావు అలియాస్ అనిల్‌ను గత సెప్టెంబర్‌లో తెలంగాణ పోలీసులు అరెస్టు చేశారు. ఆయనను విచారించగా, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, తెలంగాణకు చెందిన పలువురు పేర్లను వెల్లడించారు. ఆ సమాచారం ఆధారంగా గురువారం తెల్లవారుజామున 4 గంటలకే హైదరాబాద్‌లో నారాయణగూడ, ఎల్బీనగర్.. థానే, చెన్నై, మల్లాపురం, పాలక్కాడ్‌లో మొత్తం ఆరు చోట్ల ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. తెలంగాణకు చెందిన వీక్షణం పత్రిక ఎడిటర్ వేణుగోపాల్‌ను కలువాల సునకున్నట్టు దీపక్ రావు తన డైరీలో రాసుకోవడంతో నారాయణగూడలోని వేణుగోపాల్ ఇంట్లో, ఎల్బీనగర్‌లోని రవిశర్మ ఇంట్లో ఎన్ఐఏ అధికారులు సోదాలు చేపట్టారు. వీరిద్దరి నుంచి ఫోన్లు, పలు డిజిటల్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం ఆరుచోట్ల సుమారు ఐదుగంటలపాటు విస్తృతంగా సోదాలు జరిపారు. అనంతరం నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన సాహిత్యం, ఆరుఫోన్లు, సిమ్‌కార్డులు, రూ.1,37,210 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 10న ఎన్ఐఏ కార్యాలయంలో హాజరు కావాలని రవిశర్మకు సూచించారు. కేసు విచారణలో ఉన్నదని ఎన్ఐఏ అధికారులు తెలిపారు.

ఎవరీ సంజయ్ దీపక్‌రావు..?

మహారాష్ట్రలోని థానే జిల్లా అంబర్‌నాథ్ శివగంధనగర్‌కు చెందిన సంజయ్‌కుమార్ తండ్రి కమ్యూనిస్టు పార్టీకి చెందిన ట్రేడ్ యూనియన్ నేత. సంజయ్ జమ్ము కశ్మీర్‌లోని ఎన్ఐటీలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ చేశాడు. వామపక్ష తీవ్రవాదం వైపు ఆకర్షితుడై కశ్మీర్‌లోని వేర్పాటువాద ఉద్యమానికి మద్దతు ఇచ్చాడు. 1999లో సీపీఐఎంఎల్‌కు చెందిన సీఆర్సీ రహుఫ్ గ్రూపులో పనిచేశాడు. మహారాష్ట్ర సీపీఐ ఎంఎల్ నక్సల్బరీ గ్రూప్‌కు ఇన్‌చార్జ్‌గా పనిచేశాడు. ఆ తర్వాత 2000 జూలైలో నందుర్బార్ జిల్లాకు చెందిన సహాధా పోలీసులకు చిక్కాడు. 2002 నుంచి అనంతపురం జిల్లా రాయదుర్గం ప్రాంతంలో నక్సల్బరీ ఉద్యమంలో యాక్టివ్‌గా పనిచేశాడు. 2005లో అనంతపురం జిల్లా, మల్కనూరు పోలీసులు, కర్ణాటక పోలీసులు అరెస్టు చేయగా.. మళ్లీ 2006లో విడుదలయ్యాడు. 2007లో నుంచి కోలార్‌మైన్స్‌కు ట్రాన్స్‌ఫర్ అయ్యాడు. అనంతపురానికి చెందిన సరస్వతి అలియాస్ మాధవి ఉరఫ్ పార్వతిని పెండ్లి చేసుకున్నాడు.

ఇది అబద్ధపు కేసు.. ప్రజలు గమనించాలి

'ఇదొక అబద్ధపు కేసు. ఎటు వెళ్తుందో తెలియదు. సోదాల అనంతరం నాఫోన్ తీసుకెళ్లారు. దాని ఆధారంగా ఏం చేస్తారో తెలియదు. నా ఫోన్‌లో ఉన్న సమాచారాన్ని ఎలా వాడతారో తెలియదు. ఇవన్నీ ప్రజలు గమనించాలి' అని వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్ కోరారు. ఎన్ఐఏ సోదాల అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్ఐఏ సోదాల అనంతరం రవిశర్మ కూడా మీడియాతో మాట్లాడారు. 2016లో జనజీవన స్రవంతిలో కలిసిన తర్వాత తాను ఎలాంటి మావోయిస్టు కార్యకలాపాల్లో పాల్గొనడం లేదని స్పష్టంచేశారు. 2019లో స్థానిక పోలీసులు, 2021లో ఎన్ఐఏ అధికారులు తమ ఇంట్లో తనిఖీలు చేసినా ఎలాంటి ఆధారాలు లభించలేదని చెప్పారు. ఇప్పుడూ ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదని తెలిపారు.

వైసీపీ రాజ్యసభ అభ్యర్థులు ఖరారు!

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): వైసీపీ రాజ్యసభ అభ్యర్థులుగా వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావు, మేడా రఘునాథరెడ్డి పేర్లను ఖరారు చేసింది. ఈ మేరకు ముగ్గురు అభ్యర్థులు అసెంబ్లీలో సీఎం జగన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారిని సీఎం అభినందించారు. మూడు రాజ్యసభ స్థానాలకు ఫిబ్రవరి 27న పోలింగ్ జరగనున్నది. అదేరోజు సాయంత్రం ఫలితాలు వెలువడనున్నాయి. గురువారం సీఎం జగన్ ఢిల్లీకి వెళ్లారు. శుక్రవారం ప్రధానితో ఆయన భేటీ కానున్నారు.

కోడి కత్తి కేసు నిందితుడు శ్రీనివాస్‌కు బెయిల్

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): కోడికత్తి కేసు నిందితుడు జనిపల్లి శ్రీనివాస్‌కు బెయిల్ లభించింది. ఐదేండ్ల క్రితం అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దాడి కేసులో శ్రీనివాస్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అప్పటి నుంచి జైల్లోనే ఉంటున్న అతనికి ఏపీ హైకోర్టు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది.

పదోన్నతులకు డీపీసీల ఏర్పాటు

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): గెజిటెడ్ ఆఫీసర్లు మొదలు అడిషనల్, జాయింట్ సెక్రెటరీల (నాన్‌క్యాడర్) వరకు పదోన్నతుల కోసం ప్రభుత్వం డిపార్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటీలను (డీసీపీ) నియమించింది. సీఎస్ చైర్మన్‌గా ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, సంబంధిత శాఖ కార్యదర్శి, జీఏడీ కార్యదర్శి సభ్యులుగా నియమించింది. 29 శాఖల పరిధిలో మూడో స్థాయి గెజిటెడ్, ఆపైస్థాయి పదోన్నతులకు మరో రెండు కమిటీలు వేసింది.

ఉత్తమ లోకోషెడ్లుగా కాజీపేట, గుత్తి

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలోని కాజీపేట, గుత్తి లోకోషెడ్లకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ఎలక్ట్రిక్ లోకోల నిర్వహణలో ఈ రెండు లోకోషెడ్లు అత్యుత్తమ పనితీరు కనబరిచినట్టుగా ఎంపిక చేస్తూ గురువారం రైల్వే అధికారులు నిర్ణయం తీసుకున్నారు. కాజీపేట్‌లోని డీజిల్ లోకోషెడ్ ఎలక్ట్రిక్ లోకోల నిర్వహణలో నంబర్‌వన్ స్థానంలో నిలువగా, గుత్తి డీజిల్ లోకోషెడ్ ద్వితీయ స్థానంలో ఉన్నది. దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో 94 శాతం ఇప్పటికే విద్యుద్దీకరణ పనులు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. ఎలక్ట్రిక్ ట్రాక్షన్‌తో నడిచే రైళ్లు రోజురోజుకు పెరుగుతున్నందున ఎలక్ట్రిక్ లోకోల నిర్వహణ కోసం సౌకర్యాలను పెంచాల్సిన అవసరం ఉన్నదని దక్షిణ మధ్య రైల్వే జోన్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ సాధన వరకూ పోరుబాట

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

ముషీరాబాద్, ఫిబ్రవరి 8: ఎస్సీ వర్గీకరణ సాధన వరకూ మాదిగ విద్యార్థులు, యువత పోరుబాటను వీడొద్దని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్ విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన మాదిగ విద్యార్థులు, ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన విద్యార్థులు వర్గీకరణ కోసం రెట్టింపు ఉత్సాహంతో పని చేయాలని కోరారు. మాదిగలు, ఉపకులాల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేయాలని, వర్గీకరణ లక్ష్యసాధన చేరుకునే వరకు విశ్రమించ వద్దని కోరారు.

మోటుమర్రి-విష్ణుపురం రైల్వేలైన్‌కు గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): మోటుమర్రి-విష్ణుపురం రైల్వేస్టేషన్ల మధ్య డబుల్ రైల్వేలైన్ నిర్మాణానికి గురువారం కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపినట్టు దక్షిణమధ్య రైల్వే అధికారులు గురువారం వెల్లడించారు. రూ.1746.20 కోట్ల అంచనాలతో ఆమోదం పొందిందని, 88.81 కిలోమీటర్ల మేర డబుల్ లైన్ నిర్మాణం చేపట్టాల్సి ఉన్నదని తెలిపారు. ఈ రైల్వే లైను నిర్మాణం వల్ల తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ప్రజల అవసరాలు తీరుతాయని, సగటు రైళ్ల వేగం పెంచడంతోపాటు ప్యాసింజర్ రైళ్ల సమయపాలనను మెరుగుపర్చడానికి ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ రైల్వేలైన్ తెలంగాణలోని ఖమ్మం, సూర్యాపేట, నల్లగొండ జిల్లాలు, ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాల మీదుగా 95 మండలాల్లో ఉంటుందని పేర్కొన్నారు.

జేఈఈ మెయిన్-కీ అభ్యంతరాల గడువు పెంపు

హైదరాబాద్, ఫిబ్రవరి 8(నమస్తే తెలంగాణ): జేఈఈ మెయిన్ కీపై అభ్యంతరాల గడువును పొడిగించినట్టు జాతీయ పరీక్షల విభాగం (ఎన్టీఏ) తెలిపింది. జేఈఈ మెయిన్ సెషన్ పరీక్షల రెస్పాన్స్ షీట్లు, ప్రాథమిక కీలను మంగళవారం విడుదల చేసిన ఎన్టీఏ అధికారులు కీలో అభ్యంతరాలకు గురువారం వరకు అవకాశం కల్పించారు. సర్వర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తిన దృష్ట్యా శుక్రవారం నాటికి పెంచినట్టు ఎన్టీఏ తెలిపింది. దీంతో అభ్యర్థులు పరీక్ష పత్రాలను ప్రాథమిక కీతో సరిపోల్చుకుని అభ్యంతరాలను శుక్రవారం రాత్రి 11 గంటలలోపు తెలిపే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు.

'ఎఫ్ఎల్ఎన్ నోడల్ అధికారులు పాఠశాలలను పర్యవేక్షించాలి'

హైదరాబాద్, ఫిబ్రవరి 8(నమస్తే తెలంగాణ): స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) నోడల్ అధికారులుగా పాఠశాలల్లో వారానికి రెండురోజులు పర్యవేక్షించాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ శ్రీదేవసేన ఆదేశించారు. ఎంఈవోలు, డీఈవోలు, ఆర్జేడీలు మాత్రమే పర్యవేక్షించాలని, ఉపాధ్యాయులు విద్యాబోధనకే పరిమితం కావాలని ఇచ్చిన ఉత్తర్వుల్లో గదరగోళం ఏర్పడిన నేపథ్యంలో స్పష్టతనిస్తూ గురువారం ఈ ఉత్తర్వులు జారీ చేశారు.

సర్కారీ కొలువులకు సమాంతర రిజర్వేషన్లు

- సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం నియామకాలు
- అన్ని ఉద్యోగాలకు వర్తింపు.. ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో మహిళలకు సమాంతర రిజర్వేషన్లు (హారిజాంటల్) అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. నియామకాల్లో మహిళలకు ప్రత్యేకంగా రోస్టర్ పాయింట్‌ను మార్కు చేయకుండా ఓపెన్, రిజర్వుడు క్యాటగిరీల్లో 100లో 33 శాతం (1/3) రిజర్వేషన్లు అమలు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాజస్థాన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వర్సెస్ రాజేశ్‌కుమార్ దరియా కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం.. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్లకు సంబంధించిన నియామక ప్రక్రియలో ఈ విధానం అమలు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తెలంగాణ స్టేట్ అండ్ సబార్డినేట్ సర్వీసు నిబంధనలు -1996 ప్రకారం మహిళలకు ఓపెన్, రిజర్వుడ్ క్యాటగిరీల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్న నిబంధన ఉన్నది. గ్రూప్ - 1 ఉద్యోగ ప్రకటనలో రోస్టర్ పాయింట్ 1 నుంచి తీసుకోవడంతో మహిళలకు ఎక్కువ పోస్టులు వచ్చాయి. దీన్ని సవాల్ చేస్తూ అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో రాజస్థాన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వర్సెస్ రాజేశ్ కుమార్ దరియా కేసులో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అమలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. దీంతో టీఎస్‌పీఎస్సీ నియామకాల్లో సమాంతర రిజర్వేషన్లు అమలుచేయాలని 2022 డిసెంబర్ 2న మెమో జారీ చేసింది. ప్రస్తుతం.. హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా సుప్రీంకోర్టు తీర్పునకు లోబడి టీఎస్‌పీఎస్సీతో పాటు ఇతర విభాగాధిపతులు అందరూ మహిళలకు సమాంతర రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొన్నది.

సమాంతర రిజర్వేషన్లు అంటే?

రోస్టర్ పాయింట్ల పట్టిక 1-100 పాయింట్లను పరిగణనలోకి తీసుకొంటే ఓపెన్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగులకు కేటాయించిన పోస్టుల్లో మహిళలకు 33 (1/3) శాతం రిజర్వేషన్లు అమలవుతాయి. 2018లో జిల్లాలు, జోన్లు, మల్టీజోన్ల పునర్వ్యవస్థీకరణ తర్వాత మళ్లీ 1 నుంచి రిజర్వ్ చేయడం ప్రారంభమైంది. ఉద్యోగాల భర్తీలో ఓసీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ క్యాటగిరీల్లో రిజర్వ్ చేసిన పాయింట్లలో మహిళలు, దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్లు, ఎక్స్ సర్వీస్‌మెన్ వర్గాలకు ప్రత్యేక రిజర్వేషన్లు ఉంటాయి. సమాంతర రిజర్వేషన్లన్నను అనుసరించి.. రోస్టర్ పాయింట్ల ప్రకారం మహిళలకు ఎక్కువ పోస్టులు వస్తే అవి వారికే ఉంటాయి. ఓసీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ , దివ్యాంగుల క్యాటగిరీల్లోని మహిళలు జనరల్ కోటాలో మెరిట్‌లో ఉద్యోగం సాధించారనుకొంటే.. ఆ రిజర్వ్‌డ్ క్యాటగిరీలో మహిళల కోసం ప్రత్యేకంగా పేరొన్న పోస్టులను డీ రిజర్వ్ చేస్తారు. ఉదాహరణకు.. ఒక సామాజికవర్గంలో 1 నుంచి 10 వరకు పది పోస్టులు ఉన్నాయి. అందులో 8, 9, 10 పోస్టులు మహిళలకు రిజర్వ్ అయ్యాయి. అందులో మొదటి 3 ఉద్యోగాలను మెరిట్ ప్రకారం మహిళలే సాధించారు. అలాంటప్పుడు.. మొదటి 3 పోస్టులను మహిళలకు కేటాయించి.. 8,9,10 స్థానాల్లో మహిళా రిజర్వేషన్లను డీ రిజర్వ్ చేస్తారు. ఆ 3 పోస్టులను అదే సామాజికవర్గంలో జనరల్ పోస్టులుగా మారుతాయి. వాటికి మహిళలు, పురుషులు సమానంగా పోటీ పడవచ్చు. పది ఉద్యోగాల్లో ఒకవేళ తొలి ఏడింటిలో 2 పోస్టుల్లో మహిళలు మెరిట్ సాధిస్తే.. మహిళలకు కేటాయించిన మిగిలిన 3 పోస్టుల్లో రెండు డీ రిజర్వ్ చేస్తారు.

తిరుమలలో విమానం చక్కర్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): తిరుమలలో మరోసారి అపచారం జరిగింది. శ్రీవారి ఆలయంపై విమానం చక్కర్లు కొట్టింది. గురువారం ఉదయం 10 గంటల సమయంలో ఆలయంపై ఓ విమానం తిరుగుతూ కెమెరాలకు చిక్కింది. ఇటీవల ఆలయంపై తరచూ విమానాలు తిరుగుతున్నాయి. ఆలయంపై విమానాల తిరగడం ఆగమశాస్త్ర సంప్రదాయానికి